

నకిలీ వలలో గెలగిల

త్రిపురాంతకం మండలంలో అరటిచెట్లు ఏపుగా పెరిగినా దిగుబడి రాక దిక్కుతోచని స్థితిలో రైతులు లబోదిబోమంటున్నారు.

- 8లో..



అధైర్యపడొద్దు..అండగా ఉంటాం

ఒంగోలులో గణేష్ నిమజ్జనం సందర్భంగా జరిగిన ఘర్షణలో నమోదైన అక్రమ కేసుల నేపథ్యంలో రిమాండ్‌లో ఉన్న కార్యకర్తలను ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శించారు.

- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
32 /27

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశం ఉంది. బలమైన గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

20, 21న అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర మహాసభలు



సీఐటీయూ కార్యాలయంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: ఈ నెల 20, 21 తేదీల్లో ఒంగోలులో నగరంలోని కాపుకళ్యాణ మండపంలో నిర్వహించే అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర 11వ మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుసాల సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శుక్రవారం మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని అంగన్‌వాడీలు, హెల్పర్లకు ఉద్యోగ భద్రతలేకుండా పోయిందని చెప్పారు. సుప్రీం కోర్టు సైతం అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సూచించినట్లు గుర్తు చేశారు. మాతృ మరణాలు, శిశు మరణాలు తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తున్నా అంగన్‌వాడీలకు తగిన గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి నిధులు పెంచకుండా, ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2014 నుంచి వేతనాలు పెంచలేదని చెప్పారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పాలకులు ఐసీడీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అంగన్‌వాడీల అభివృద్ధికి తగినంతగా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఈదర అన్నపూర్ణ, ఎం.రమేష్, ఎస్.ధనలక్ష్మి, బి.శేషమ్మ, సుబ్బమ్మ, కె.మున్నా తదితరులు పాల్గొన్నారు.

దరకాసుల వేట..!

బార్ల విషయంలో అధికార కూటమి నేతలు కుట్రలు పన్నుతూనే ఉన్నారు. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత అధికార పార్టీ వారంతా సమావేశమై దరఖాస్తులకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. దరఖాస్తుల స్వీకరణ గడువు పూర్తయినా అన్ని బార్లకు దరఖాస్తులు రాలేదు. మొత్తం 29 బార్లకుగాను, 25 బార్లకు డ్రా తీశారు. ఇంకా మిగిలిన నాలుగు బార్ల విషయంలో ఎక్సైజ్ శాఖ అధికారులపై తీవ్ర ఒత్తిడి వస్తోంది. దరఖాస్తు గడువు ఈనెల 17వ తేదీ వరకు పొడిగించినా ఒక్క దరఖాస్తు రాలేదు. గడువు లోపు 16 మందితో దరఖాస్తులు వేయించేలా అధికారులు వ్యాపారులను బతిమాలుకుంటున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉండగా డ్రా పూర్తయిన వాటిలో మరో నాలుగు ఇంకా బార్లు పెట్టలేదని తెలిసింది. వారు ఉంటారా? వైదొలుగుతారా ? అన్న టెన్షన్ అధికారుల్లో నెలకొంది. మొత్తం మీద అధికార పార్టీ నాయకుల కుట్రలకు అధికారులు బలవుతున్నారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.



- పచ్చ సిండికేట్ మాయాజాలం
- జిల్లాలో నాలుగు బార్ల లైసెన్స్‌లు పెండింగ్
- దరఖాస్తు చేయకుండా తెరవెనుక కుట్రలు
- దరఖాస్తుదారుల వెతుకులాటలో అధికారులు
- మొత్తం 16 మంది చేత చేయించాలని ఒత్తిడి
- మొత్తం 29 బార్లకు గాను 25 బార్లకు పూర్తయిన డ్రా
- మిగిలిన వాటికి దరఖాస్తుకు గడువు 17 వరకు పొడిగింపు
- అన్నీ పూర్తయినా ఏర్పాటు కాని నాలుగు బార్లు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

అధికార పార్టీకి చెందిన నాయకుల కుట్రలు ఫలితంగా నూతన బార్ పాలసీని అమలు చేసేందుకు ఎక్సైజ్ అధికారులు ఆపసోపాలు పడుతున్నారు. అడ్డగోలు షరతులు విధించడంతో బార్లు ఏర్పాటు చేసుకునేందుకు ఎవరూ ఆసక్తి చూపించడంలేదు. మరో వైపు కూటమి నాయకులు సిండికేట్ కావడంతో బార్లకు దరఖాస్తు చేసుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడం అధికారులకు టెన్షన్ పట్టుకుంది. బార్లకు నోటిఫికేటన్ ఇచ్చిన తర్వాత దరఖాస్తుల స్వీకరణ తేదీలను రెండుసార్లు వాయిదా వేసుకున్నప్పటికీ మొక్కుబడిగానే దరఖాస్తులు వచ్చాయి. అధికార పార్టీ ఎమ్మెల్యేల కనుసన్నల్లో సిండికేట్ అయిన వ్యాపారులు కొత్తగా ఎవరూ బార్లకు దరఖాస్తు చేయకుండా అడ్డుకున్నట్లు ప్రచారం జరిగింది. ఫలితంగా అతి కష్టంమీద వ్యాపారులు దరఖాస్తు చేసుకునేలా అధికారులు కృషి చేశారు. అయినా పూర్తి బార్లకు దరఖాస్తులు రాలేదు. తొలివిడత బార్లకు డ్రా వేసి లైసెన్సులు ఖరారు చేశారు. జిల్లాలో 29 బార్లకుగాను 25 బార్లకు డ్రాలు తీసి లైసెన్సులు ఖరారు చేశారు. మిగిలిన 4 బార్లకు సైతం వ్యాపారస్తులతో ఎలాగైనా సరే డ్రా నిర్వహించాలని ప్రభుత్వం ఒత్తిడి చేస్తుండడంతో ఎక్సైజ్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.. దీంతో పాత వ్యాపారుల లిస్టు తయారు చేసుకుని బాబ్బాబు...బార్ కోసం దరఖాస్తు చేయండి..ప్లీజ్ అంటూ వారి చుట్టూ తిరుగుతూ బతిమాలుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఒక్క దరఖాస్తు కూడా రాలేదు...

వాయిదాల మీద వాయిదాలు వేసి నోటిఫికేషన్ల మీద నోటిఫికేషన్లు విడుదల చేసినప్పటికీ జిల్లాలో మొత్తం బార్లకు దరఖాస్తులు రావడం గగనంగా కనిపిస్తోంది. ఆగస్టు 18వ తేదీ కూటమి ప్రభుత్వం నూతన బార్ల పాలసీని ప్రకటించింది. జిల్లాలో ఓపెన్ కేటగిరిలో 26, రిజర్వ్ కేటగిరీలో 3 బార్లు మొత్తం కలుపుకొని 29 బార్లకు లైసెన్సులు మంజూరు చేయాలని నిర్ణయం తీసుకుంది. దీనికి ఒక్కో బార్‌కు నాలుగేసి దరఖాస్తులు వస్తేనే డ్రా తీయాలని, లేకపోతే రీ నోటిఫికేషన్ ఇవ్వాలని నిర్ణయించారు. నోటిఫికేషన్ విడుదల చేసిన రోజు నుంచి దరఖాస్తులు స్వీకరించడం మొదలుపెట్టింది. మొదట ఆగస్టు 26వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు ప్రకటించింది. అయితే ప్రభుత్వం ఆశించిన రీతిలో దరఖాస్తులు రాలేదు. దాంతో మరో రెండు రోజుల పాటు దరఖాస్తులకు గడువు పెంచి 28వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించింది. అయినా స్పందన రాకపోవడంతో బార్ పాలసీ ఫ్లాప్ అయినట్లు ప్రచారం జరిగింది. జిల్లాలో మద్యం దుకాణాలను బినామీల ద్వారా నిర్వహిస్తున్న అధికార పార్టీ ఎమ్మెల్యేలు చేసిన కుట్రలతోనే దరఖాస్తులు రాలేదని ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. దీంతో నామోషీగా ఫీలైన ప్రభుత్వం అధికారులు, అధికార పార్టీ నాయకులను రంగంలోకి దించి బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వాహకులపై ఒత్తిడి చేయించి దరఖాస్తులు చేయించినట్లు సమాచారం. మొత్తం మీద తొలివిడతలో ఓపెన్ కేటగిరీలో 84 దరఖాస్తులు, గీతకార్మికులకు కేటాయించిన బార్లకు 14 దరఖాస్తులు వచ్చాయి. ఆగస్టు 30వ తేదీన ఓపెన్ కేటగిరీలో 22, గీత కార్మికులకు రిజర్వ్ చేసిన 3 బార్లకు డ్రా తీసి లైసెన్సులు మంజూరు చేశారు. మిగిలిన నాలుగు బార్లు మిగిలిపోయాయి. ఇందులో ఒంగోలు 2, మార్కాపురం 2 బార్లు ఉన్నాయి. వాటి కోసం రీ నోటిఫికేషన్ విడుదల చేశారు. తొలుత 14వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పి తరువాత 17వ తేదీ వరకు గడువు పొడిగించారు. 18వ తేదీ డ్రా తీస్తారు. కానీ ఇప్పటి వరకు కనీసం ఒక్క దరఖాస్తు కూడా రాలేదని సమాచారం. దీంతో ఏం చేయాలో తెలియక ఎక్సైజ్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

మరో నాలుగు బార్ల సంగతేంటో?

ఇదిలా ఉండగా మొదటి విడతలో మొత్తం 25 బార్లకు డ్రా తీసి లైసెన్సులు మంజూరు చేయడం తెలిసిందే. ఇందులో ఇప్పటికే బార్ అండ్ రెస్టారెంట్లు నిర్వహిస్తున్న 21 బార్లకు రెన్యువల్ చేసుకున్నారు. మిగిలిన 4 బార్లు మిగిలిపోయినట్లు తెలుస్తోంది. ఈ నాలుగు బార్లకు లైసెన్సులు తీసుకున్నప్పటికీ ఇంకా బార్లు పెట్టలేదని సమాచారం. దీంతో ఆ నాలుగు బార్లు కొనసాగిస్తారో లేకపోతే వారు డ్రాప్ అయిపోతారో తెలియాల్సి ఉంది. ఒకవేళ ఆ నాలుగు బార్లు ఆగిపోతే అప్పుడు ఏం చేస్తారన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వాటికి కూడా నోటిఫికేషన్ ఇచ్చి మళ్లీ డ్రా తీస్తారా లేక అదే లైసెన్సులను మరొకరి బదిలీ చేస్తారా అన్నది తేలాల్సి ఉంది.

అధికారులపై ఒత్తిడి...

ఒంగోలు, మార్కాపురాలకు కేటాయించిన నాలుగు బార్లకు టెండర్లు వచ్చేలా చేయాలని ప్రభుత్వ పెద్దలు ఎక్సైజ్ అధికారులకు హుకుం జారీ చేసినట్లు సమాచారం. ఒక్కో బార్‌కు నాలుగు దరఖాస్తులు వస్తేనే డ్రా తీయాలని, లేకపోతే రీ నోటిఫికేషన్ ఇవ్వాలని షరతు విధించడం తెలిసిందే. దాంతో ఇప్పుడు ఈ నాలుగు బార్లకు గాను 16 దరఖాస్తులను ఎక్కడి నుంచి తీసుకొని రావాలో తెలియక అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. పైగా ఒక్కో దరఖాస్తుకు రూ.5 లక్షల దరఖాస్తు ఫీజు, ప్రాసెసింగ్ చార్జీల కింద మరో రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుంది. అంటే రూ.81.60 లక్షలు ఫీజు వసూలు చేయాలన్నమాట. ఈ ఫీజు నాన్ రిఫండబుల్ కావడంతో దరఖాస్తు చేసేందుకు ఎవరూ ముందుకు రావట్లేదని అధికారులు చెబుతున్నారు. అయినా మీరేం చేస్తారో తెలియదు, నాలుగు బార్లకు దరఖాస్తులను వేయించి తీరాల్సిందేనని మెడ మీద కత్తిపెట్టినట్లు ఒత్తిడి చేస్తున్నట్లు ఉద్యోగులు చెప్పుకుంటున్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే సమగ్రాభివృద్ధి

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ
- అక్రమంగా పింఛన్లు తొలగించారంటూ ఎమ్మెల్యేలు బూచేపల్లి, తాటిపర్తి ధ్వజం
- ఐదేళ్లుగా పింఛన్ తీసుకుంటున్న వారిని ఎలా తొలగించారు
- అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు
- కనీసం ప్రొటోకాల్ పాటించడంలేదని బూచేపల్లి ఆగ్రహం
- తొలగించిన పింఛన్లు ఇవ్వాలంటూ సభ్యులు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు సిటీ: జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పిలుపునిచ్చారు. పాత జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాలో వ్యవసాయ సంబంధిత పనులు ఊపందుకుంటున్నందున వ్యవసాయ, నీటి పారుదల శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు. ప్రకాశం జిల్లా డీఆర్వో బి.చిన ఓబులేసు, జెడ్పీ సీఈవో చిరంజీవి, బాపట్ల జిల్లా ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ గంగాధర గౌడ్, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, ఉమ్మడి ప్రకాశం జిల్లా జెడ్పీటీసీలు, ఎంపీపీలు, అన్ని శాఖల జిల్లాస్థాయి అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్, డీఆర్‌డీఏ, విద్యుత్, రోడ్లు - భవనాలు, వైద్య, వ్యవసాయ శాఖల్లోని సమస్యలపై ప్రధానంగా చర్చించారు.

ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ చీమకుర్తి మండలంలో ఎంతో మంది వికలాంగులు తమకు పింఛన్ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. వికలాంగులను పెన్షన్ కోసం ఇబ్బంది పెట్టడం చాలా బాధాకరమన్నారు. మన జిల్లాలో ఒక మహిళ పెన్షన్ కోసం ఆఫీస్‌కు వెళితే ఆమె చనిపోయినట్లు రాశారన్నారు. బతికి ఉన్న మనిషిని కూడా చనిపోయినట్లు రాశారంటే ఒకసారి అందరూ ఆలోచించాలన్నారు. వికలాంగులు, వితంతువులను పింఛన్ల కోసం ఇబ్బంది పెట్టడం తగదన్నారు.

పెన్షన్లపై మెడికల్ రీ అసెస్మెంట్

గతంలో పెన్షన్లు పొందిన వారు ప్రస్తుతం పెన్షన్లకు దూరమయ్యారని, అర్హులైన తమకు అన్యాయం జరుగుతోందని వారు ఆందోళన చెందుతున్నారని దర్శి, వైపాలెం ఎమ్మెల్యేలతో పాటు పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలు కూడా సందర్భంగా అధికారుల దృష్టికి తెచ్చారు. దీనిపై డీఆర్డీఏ పీడీ నారాయణ మాట్లాడుతూ అర్హులందరికీ పెన్షన్లు వస్తాయని, మెడికల్ రీ అసెస్మెంట్ జరుగుతోందని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చని చెప్పారు.

ఇతర జెడ్పీటీసీలు, ఎంపీపీలు కూడా రోడ్ల విషయంలో స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. స్థానికంగా జరుగుతున్న మరమ్మతు పనుల పురోగతిని ఆర్అండ్‌బీ అధికారులు వారికి వివరించారు.

తమ ప్రాంతంలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీ.డీ.లు కట్టిన రైతులు వాటి కోసం ఎదురు చూస్తున్నారని ప్రజా ప్రతినిధులు చెప్పగా, ట్రాన్స్‌ఫార్మర్లు త్వరగా అందేలా చూస్తామని, విద్యుత్ తీగలను సరి చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాల్లో చేసిన తీర్మానాలను సమావేశం ఈ సందర్భంగా ఆమోదించింది.

అర్హత ఉన్నా వికలాంగ పింఛన్ తొలగించారు..: యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

70 శాతం వికలాంగుడిగా సర్టిఫై చేసిన వ్యక్తిని 40 శాతంగా ఎవరు నిర్ధారించారు ? ఎలా నిర్ధారించారని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అధికారులను నిలదీశారు. టీడీపీ వారు చెప్పారని ఆ పనిచేశారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వై.చెర్లోపల్లికి చెందిన 70 ఏళ్ల వికలాంగురాలికి సెలైన్ కూడా మంచంలోనే పెట్టి ఉందని, ఇటువంటివారి పింఛన్‌ను కూడా తీసేశారని, ఆ హక్కు మీకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. 30 విడో పింఛన్లు తొలగించారని, ఆ వివరాలు ఆన్‌లైన్‌లో కనిపిస్తాయని, వేలిముద్ర వేయడానికి వెళ్తే వేసుకోరని విమర్శించారు. 2,896 మంది వికలాంగులను ఏ డాక్టరు వచ్చి చెక్ చేశారనీ, ఏ డాక్టరు సర్టిఫై చేశారని ప్రశ్నించారు. ప్రజా సమస్యలు మాట్లాడే సమయంలో మంత్రి లేకపోవడం శోచనీయమన్నారు. అధికారులు మళ్లీ మీటింగుకు వచ్చే వరకు కనపడరని, మెసేజ్ లకు అధికారులు రెస్పాండ్ కావడంలేదని ఆరోపించారు. కలెక్టర్, మంత్రి ఓఎస్డీ దృష్టికి తీసుకెళ్లామని ఈ సమస్య ఎట్లా తీరుతుందనీ, సమస్య తీరనప్పుడు ఈ వ్యవస్థలు, మీటింగ్‌లు ఎందుకు అని ప్రశ్నించారు. మీరు అడ్డగోలుగా అక్రమంగా పింఛన్లు తీసేస్తే ఊరుకునేది లేదన్నారు. ఈ 2,896 మందితో మీ ఆఫీస్ వద్దకు వచ్చి ధర్నా కూర్చుంటామని హెచ్చరించారు. ఒకే నియోజకవర్గంలో ఇంతమంది ఉంటారా అని, ఈ సమస్యను పీడీ నారాయణ త్వరగా పరిష్కరించాలని కోరారు. అర్హత లేని వ్యక్తిని ఎంపీడీఓగా నియమిస్తున్నారని, కలెక్టర్ దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా ఉపయోగం లేదన్నారు. యర్రగొండపాలెం పంచాయతీ, త్రిపురాంతకం పంచాయతీల్లో గ్రేడ్-1 ఈఓను నియమించాల్సిందిపోయి గ్రేడ్-3 ఆఫీసర్ ని నియమిస్తున్నారని ఇలా చేస్తే వ్యవస్థలు ఎలా నడుస్తాయని ధ్వజమెత్తారు. కాలువలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. నీరు పారేలా కాలువలను శుభ్రం చేయించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. దోర్నాలలోని గండి చెరువు నుంచి నీరు లీక్ కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోర్నాల కమ్యూనిటీ ఆస్పత్రి, యర్రగొండపాలెం ఏరియా ఆస్పత్రుల్లో అవసరమైన వైద్యులు లేరని, దోర్నాల ఆస్పత్రిలో నీటి సమస్య నెలకొందని, యర్రగొండపాలెం ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంక్ లేదని అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని ఇతర మండలాల నుంచి యర్రగొండపాలెం కేంద్రానికి అనుసంధానమైన రోడ్లలో మరమ్మతు పనులు వేగవంతం చేయాలని ఆయన కోరారు.

3 వేల పెన్షన్లు కావాలనే కక్షపూరితంగా తీసేశారు: దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



3 వేల పెన్షన్లు కావాలనే కక్షపూరితంగా తీసేశారని దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇప్పుడు కొత్త రీవెరిఫికేషన్ ఎప్పుడు ప్రారంభమవుతుంది, సదరమ్ క్యాంపులు మండలాల వారీగా, జిల్లా వారీగా, నియోజకవర్గాల వారీగా పెడతారా అని డీఎంఅండ్‌హెచ్‌ఓను ప్రశ్నించారు. నియోజకవర్గాల వారీగా సదరమ్ క్యాంపులు పెట్టేటప్పుడు ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలన్నారు. అధికారులు పదిహేను రోజుల ముందుగా నోటీసుబోర్డులో పెడితే తమ పరిధిలోని పింఛన్లు ఇప్పించుకోవడానికి ప్రజాప్రతినిధులు ప్రయత్నిస్తారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కొత్త వితంతువు పింఛను కూడా ఇవ్వలేదని అధికారులే చెబుతున్నారన్నారు. మలేరియా, డెంగీ జ్వరాల బారిన పడినవారి ఎటువంటి చర్యలు చేపడుతున్నారో అధికారులు తెలియజేయాలన్నారు. విద్యుత్ పోల్స్ వచ్చినప్పుడు కండెక్టర్ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కండెక్టర్లను ఎవరు అమ్ముకున్నారో చెప్పాలని నిలదీశారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు వాడితే ఫ్రీ ఉందా లేదా అని ప్రశ్నించారు. మోటుపల్లి ఒక చిన్న గుడిసెలో ఉంటున్న పేదవారిని విద్యుత్ బకాయి రూ.7 వేలు ఉంది కట్టాలంటూ ఇబ్బంది పెడుతున్నారని, దీనిని పరిశీలించాలని విద్యుత్ అధికారులను కోరారు. రైతులకు కావాల్సినంత డీఏపీ, యూరియా సరఫరా చేయాలని కోరారు. బ్లాక్ మార్కెట్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, పక్కన ఎమ్మెల్యే బూచేపల్లి, హాజరైన జెడ్పీటీసీలు, ఎంపీపీలు

అన్నీ ఏకపక్ష తీర్మానాలే

- స్టాండింగ్ కమిటీ లేకుండా మేయర్‌తో రూ.కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం
- మొక్కుబడిగా కౌన్సిల్‌లో పెట్టిన పాలకమండలి
- అడుగడుగునా అడ్డుతగిలిన వైఎస్సార్ సీపీ సభ్యులు
- ట్రంకు రోడ్డు, బరియల్ గ్రౌండ్ అంశాలపై వైఎస్సార్ సీపీ సభ్యుల నిరసన
- యాదవ భవన్ విషయంలో మాటమార్చిన ఎమ్మెల్యే
- 'సాక్షి' కథనంపై ఎమ్మెల్యే అక్కసు



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో అన్నీ ఏకపక్ష తీర్మానాలే జరిగిపోయాయి. ప్రజా వ్యతిరేక తీర్మానాలపై వైఎస్సార్ సీపీ సభ్యులు అడుగడుగునా అడ్డుతగిలినా చెవిటివాడి చెవిలో శంఖం ఊదినట్లుగా ఉంది తప్ప ప్రజలకు మేలు చేద్దామన్న ఆలోచనే కూటమి సభ్యులు చేయలేదు. శుక్రవారం ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో కౌన్సిల్ సమావేశం ఇన్‌చార్జ్ మేయర్ వేమూరి సూర్య నారాయణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో 64 అంశాలను ఆమోదానికి పెట్టారు. వాటిలో సగానికి పైగా ముందస్తు అనుమతులుగా పెట్టుకున్నవే. స్టాండింగ్ కమిటీ ఏర్పాటు చేయకుండా రూ.కోట్ల అభివృద్ధి పనులు మేయర్ ముందస్తుగా ఆమోదిస్తే వాటిని కౌన్సిల్ ఆమోదానికి పెట్టారు. దీనిపై వైఎస్సార్ సీపీ సభ్యులు గళమెత్తారు. అయినా లెక్క చేయకుండా మంద బలంతో అన్నింటినీ ఆమోదం చేసుకున్నారు. ట్రంకు రోడ్డు, ముస్లిం బరియల్ గ్రౌండ్ విషయంలో వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్ ఖాన్ అడుగడుగునా అడ్డుతగిలారు. ఇమ్రాన్ ఖాన్‌తో పాటు వైఎస్సార్ సీపీ కో ఆప్షన్ సభ్యురాలు రషీదా కూడా ప్రజా వ్యతిరేక విధానాలపై పార్టీ గళం వినిపించారు. ఇరువురూ కలిసి రెండుసార్లు టీడీపీ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై గొంతెత్తి నిలదీశారు. ముస్లిం బరియల్ గ్రౌండ్ విషయంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్.. ఒంగోలు అర్బన్ తహశీల్దార్ పిన్నిక మధుసూదన్ రావును కౌన్సిల్ సమావేశానికి హుటాహుటిన పిలిపించారు. ముస్లిం బరియల్ గ్రౌండ్‌కు కమ్మపాలెం తరువాత దశరాజుపల్లి రోడ్డు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కేటాయించిన స్థలం కాకుండా ముక్తినూతలపాడు రోడ్డులో మూడు ఎకరాలు కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే కౌన్సిల్‌లో ప్రకటించారు. దాంతో వైఎస్సార్ సీపీతో పాటు కూటమి ప్రభుత్వంలోని భాగస్వామ్య పార్టీకి చెందిన జనసేన నాయకుడు, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు కూడా ఆ స్థలం విషయంలో అడ్డుతగిలారు. అయినా తహశీల్దార్ పిన్నిక మధుసూదనరావు కుంట పోరంబోకులో మెరక ఉంది దానిని కేటాయిస్తున్నామన్నారు. కన్వర్షన్ లేకుండా ఏవిధంగా కేటాయిస్తారు...అందుకు సంబంధించిన వివరణ ఇవ్వాలని అడిగినా సమాధానం లేకుండా పోయింది. దాంతో పాటు యాదవ భవన్ విషయంలో కూడా ఎమ్మెల్యే మాట మార్చారు. దిబ్బల రోడ్డు యాదవ భవన్ స్థలం ప్రస్తావన తీసుకొచ్చారు. ట్రంకు రోడ్డు విస్తరణ విషయం కోర్టు పరిధిలోకి పోయింది కాబట్టి నగర ప్రజల ఆమోదం మేరకు నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే దాటేశారు. మస్తాన్ దర్గా నుంచి కొత్తపట్నం బస్టాండ్ వరకు రోడ్డు విస్తరణ విషయం కూడా వ్యాపారులు, స్థానికుల ఆలోచనల మేరకు ఏకాభిప్రాయంగానే నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. 'సాక్షి' దిన పత్రికలో శుక్రవారం వచ్చిన కథనంపై అక్కసు వెళ్లగక్కారు. సమావేశంలో కమిషనర్ వెంకటేశ్వర రావు, ఎంఈ ఏసయ్య, ఏసీపీ సుధాకర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



వేమూరి సూర్యనారాయణ

ఎయిడెడ్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించాలి

- ఏపీ టీచర్స్ గిల్డ్ డిమాండ్

ఒంగోలు సిటీ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మిగులుగా ఉన్న 145 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, ప్రభాకరరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ఎయిడెడ్ పాఠశాలల్లో జీవో నంబర్ వన్ ప్రకారం మిగులుగా ఉన్న 95 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, 50 మంది స్కూల్ అసిస్టెంట్లు, తెలుగు, హిందీ, పీఈటీలు మిగులుగా ఉన్నారని తెలిపారు. మండలాల వారీగా ఒంగోలు 11, నాగులుప్పలపాడు 13, దొనకొండ 5, దర్శి 2, కంభం 17, మార్కాపురం 9, యర్రగొండపాలెం 8, కొమరోలు 12, గిద్దలూరు 17, కనిగిరి 7, చీరాల 12, ఇంకొల్లు 5, యద్దనపూడి 3, వెలిగండ్ల 5, హనుమంతునిపాడు 5, అర్ధవీడు 2, పుల్లలచెరువు 2, రాచర్ల 4, కొత్తపట్నం 2, కొరిశపాడు 2, జె.పంగులూరు 3 ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఖాళీగా ఉన్నారని తెలిపారు.

పత్రికలపై కేసులు సరికాదు



ప్రజాస్వామ్య పరిరక్షణలో పత్రికల పాత్ర కీలకంగా ఉంటుంది. ఏదైనా వార్తల విషయంలో నచ్చని అంశాలు ఉంటే వాటిని ఖండించే అవకాశం ఉంది. వ్యక్తిగతంగా నష్టం కలిగిందనుకున్న సందర్భంలో న్యాయపరంగా చర్యలు తీసుకోవచ్చు. అన్ని మార్గాలు, అవకాశాలు ఉండగా.. పాత్రికేయులపై అక్రమ కేసులు బనాయించడం, అరెస్టులు చేయించడం సమర్థనీయం కాదు. ఇలా ప్రతికల గొంతులు నొక్కే విధానాలు మానుకోవాలి.

– చింతంగుంట్ల సాల్మన్ రాజు, సీనియర్ న్యాయవాది, కనిగిరి



ఎడిటర్ మీద కేసులు సహేతుకం కాదు



రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. పత్రికా స్వేచ్ఛను హరిస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రమాదకరంగా పరిణమించేలా ఉన్నాయి. ప్రభుత్వ విధానాలను విశ్లేషిస్తూ వార్తలు రాయడం నేరమైతే ఇక ప్రజాస్వామ్యం ఏముంటుంది. ప్రశ్నించే నైజాన్ని సహించలేకపోవడం దేనికి సంకేతం. ఇప్పటికైనా ప్రభుత్వం తీరు మార్చుకోవాలి. 'సాక్షి'పై కేసులను ఎత్తివేయాలి. పత్రికా స్వేచ్ఛకు కట్టుబడి ఉండాలి.

– తోటా సుధారాణి, న్యాయవాది, ఒంగోలు బార్ అసోసియేషన్ మహిళా రిప్రజెంటేటివ్

క్లుప్తంగా

కుమార్తె మృతిపై తల్లి అనుమానం



మృతి చెందిన సుమతి

కంభం: స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో అనారోగ్యంతో చికిత్సపొందుతూ తెలుగు వీధికి చెందిన మోదులార్ సుమతి(35) మృతి చెందింది. కుమార్తె మృతిపై అనుమానం ఉందని తల్లి సుశీల పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. దీంతో అనుమానస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు. మృతురాలికి భర్త రాముడు, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మార్కాపురం అటవీ శాఖ డీడీగా రావుఫ్



బాధ్యతలు స్వీకరిస్తున్న రావుఫ్

మార్కాపురం: మార్కాపురం అటవీ శాఖ నూతన డిప్యూటీ డైరెక్టర్ గా అబ్దుల్ రావుఫ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీశైలం టైగర్ ప్రాజెక్ట్ డీఎఫ్ఓగా పనిచేస్తూ బదిలీపై మార్కాపురం అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన సందీప్ కృపాకర్ అటవీ శాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈయనను డీఆర్ఓ పిచ్చిరెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగరాజుగౌడ్, సిబ్బంది కలిసి అభినందించారు.

సెల్‌ఫోన్ల దొంగ అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ సీఐ షేక్ మౌలా షరీఫ్

ఒంగోలు టౌన్: రైల్వే స్టేషన్లలో సెల్‌ఫోన్లను దొంగలిస్తున్న వ్యక్తిని జీఆర్‌పీ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం రైల్వే స్టేషన్‌లోని జీఆర్పీ పోలీసు స్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జీఆర్పీ సీఐ షేక్ మౌలా షరీఫ్ నిందితుడి వివరాలు వెల్లడించారు. వేటపాలెం గ్రామానికి చెందిన ఆసాది చంగల్‌రావు గత కొంతకాలంగా సెల్‌ఫోన్లను దొంగలిస్తున్నాడు. రైలు ప్రయాణికులు నిద్రిస్తున్న సమయంలో వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లను తస్కరిస్తున్నాడు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న జీఆర్పీ పోలీసులు గట్టి నిఘా పెట్టారు. శుక్రవారం చంగల్‌రావును అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి రూ.1.49 లక్షల విలువైన 12 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ కొండయ్య, జీఆర్పీ ఎస్సై కె.మధుసూదన్ రావు పాల్గొన్నారు.

పోక్సో కేసుపై డీఎస్పీ విచారణ

కొత్తపట్నం: మండలంలోని వజ్జిరెడ్డిపాలెం గ్రామ పరిధిలో ఇద్దరు బాలికలపై పెదనాన్న వరుసయ్యే దొడ్ల వీరారెడ్డి అనే వ్యక్తి లైంగికదాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదైంది. శుక్రవారం ఒంగోలు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ రమణ కుమార్ వజ్జిరెడ్డిపాలెం గ్రామంలో విచారణ చేపట్టారు. నిందితుడు వీరారెడ్డి ఇంటిని పరిశీలించి కుటుంబ సభ్యులను, స్థానికులను విచారించారు. అదే విధంగా బాలికల తల్లిదండ్రులను పరామర్శించి చట్టపరంగా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. విచారణ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు సమర్పిస్తామని డీఎస్పీ తెలిపారు. ఆయన వెంట కొత్తపట్నం ఎస్సై వేముల సుధాకర్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

చీమకుర్తి రూరల్: మండలంలోని గోనుగుంట–గుండువారి లక్ష్మీపురం గ్రామాల మధ్య కారుమంచి సాగర్ కాలువ పక్కన పొలంలో గుర్తు తెలియని పురుషుడి మృతదేహం లభ్యమైంది. శుక్రవారం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, సిమెంట్ రంగు నెక్ టీషర్ట్, లేత నీలం రంగు షార్ట్ ధరించి ఉన్నాడని సీఐ సుబ్బారావు తెలిపారు. మృతుడి ఆనవాళ్లు తెలిసిన వారు 9121104179, 9121102113ని సంప్రదించాలని సూచించారు.

నకిలీ వలలో గెలగిల!



త్రిపురాంతకం మండలంలో నిండా మునిగిన అరటి రైతులు

- సుమారు 150 ఎకరాల్లో అరటి సాగు
- తోటలు ఏపుగా పెరిగినా దిగుబడి రాకపోవడంతో ఆందోళన
- ఎకరాకు రూ.3 లక్షలు నష్టపోయామని రైతుల ఆవేదన
- మొక్కలు విక్రయించిన దళారి చేతులెత్తేసిన వైనం
- నష్టపరిహారం అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

త్రిపురాంతకం: అరటి సాగు చేసిన రైతుల ఆశలు ఆవిరైపోయాయి. నకిలీ కాటుకు రైతులు ఆర్థికంగా బలయ్యారు. అరటి చెట్లు ఏపుగా పెరిగినా దిగుబడి రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో లబోదిబోమంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. త్రిపురాంతకం మండలంలో రైతులు గత ఏడాది కాలంగా అరటి తోటలు విస్తారంగా సాగు చేస్తున్నారు. గతంలో మిరప, వరి, ఇతర పంటలను సాగు చేసిన రైతులు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో అరటి సాగుపై దృష్టి సారించారు. మండలంలో సుమారు 150 ఎకరాల వరకు అరటి తోటలు సాగవుతుండగా ముందస్తుగా నాటిన తోటలు కాపుదశకు చేరుకున్నాయి. ఏపుగా పెరిగిన అరటి చెట్లను చూసి ఆనందించిన రైతులు.. రోజులు గడుస్తున్నా అరటి గెలలు కాయకపోతుండటంతో ఆందోళనకు గురయ్యారు. సోమేపల్లి, శ్రీనివాసనగర్, మిరియంపల్లి, వెల్లంపల్లి గ్రామాల్లో సాగు చేసిన 15 ఎకరాల తోటల్లో ఒకటీ అరా గెలలు తప్ప పూర్తి స్థాయిలో కాపు రాలేదు. పంట చేతికొస్తే పెట్టుబడి సొమ్ము రూ.2 లక్షలకు పైగా పోను ఎకరాకు కనీసం రూ.2 లక్షల లాభం వస్తుందని ఆశించిన రైతులు.. ప్రస్తుత పరిస్థితి చూసి తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. అరటికి ఈ క్రాప్ చేయించామని, పంట నష్ట పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎకరాకు రూ.2 లక్షలకు పైగా పెట్టుబడి

ఒక్కో అరటి మొక్కను రూ.12 నుంచి రూ.15 వరకు వెచ్చించి కొనుగోలు చేసిన రైతులు ఎకరాకు 1200 నుంచి 1400 మొక్కలు నాటారు. మొక్కలకు అవసరమైన గెడలు, సేద్యం ఖర్చులు, ఎరువులు, కూలీల ఖర్చు ఇలా మొత్తం రూ.2.50 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టారు. దిగుబడి రాకపోవడంతో పెట్టుబడి మొత్తం బూడిదలో పోసిన పన్నీరైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



త్రిపురాంతకం మండలంలో పంట పండక మోడువారిన అరటి తోట



త్రిపురాంతకం మండలంలో సాగు చేస్తున్న అరటి తోటలు

పంట రాకపోతే నేనేం చేస్తా?

పది నెలల క్రితం సాగు చేసిన అరటి మొక్కలు ప్రస్తుతం 12 అడుగుల వరకు పెరిగాయి. గెలలు వస్తాయని ఎదురుచూస్తున్న రైతులు ఇటీవల అనుమానం రావడంతో ఉద్యానశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తోటలను పరిశీలించిన అధికారులు అరటి మొక్కలకు కాపురాదని చెప్పడంతో రైతులు విస్తుపోయారు. 'నర్సరీ యజమాని మంచి కాపు వస్తుందని చెప్పడంతో వాటిని ఎంపిక చేసుకుని అందించా. ఫలసాయం రాకపోతే నేనేం చేస్తా' అని దళారి మాట దాటవేస్తున్నాడని రైతులు ఆరోపిస్తున్నారు.

ఇలా నష్టపోతామనుకోలేదు



ఎకరా పొలంలో అరటి సాగు చేశా. సుమారు 1200 మొక్కలు నాటా. పెట్టుబడి రూ.3 లక్షలు ఖర్చయింది. తోటలో అక్కడక్కడా ఓ గెల కనిపిస్తోంది. ఇదేం అన్యాయమో గతంలో ఎన్నడూ లేని విధంగా పంట నష్టపోయా. ఏడాదిపాటు కష్టం చేసినా పంట రాకుండా పోయింది. ఇప్పుడు మమ్మల్ని ఆదుకునేదెవరు. అరటి రైతుకు నష్ట పరిహారం అందించేలా చూడాలి.

– టి.బొర్రయ్య, శ్రీనివాసనగర్

ప్రభుత్వం ఆదుకోవాలి



ఎకరా పొలంలో 14 వందల మొక్కలు నాటా. ఏడాది కాలంగా మొక్కలను కంటికి రెప్పలా కాపాడుకున్నాం. తోట మొత్తం మీద 300 మొక్కలకు అక్కడక్కడా గెలలు కనిపిస్తున్నాయి. రైతులం ఘోరంగా దెబ్బతిన్నాం. ఇప్పటికే భారీగా పెట్టుబడి పెట్టాం. ఇక పంట రాదని చెబుతున్నారు. మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

– ఆర్.బాలరాజు, శ్రీనివాసనగర్

అధికారులు కాపు రాదని చెప్పారు



మూడు ఎకరాల్లో అరటి సాగు చేశా. మొక్కలు ఇప్పించిన దళారి ఇప్పుడు పంటకు గ్యారంటీ లేదంటున్నాడు. ఇప్పటి వరకు రూ.6 లక్షలు పెట్టుబడిపెట్టా. పంట పండితే రూ.12 లక్షల వరకు ఫలసాయం వచ్చేది. ఇప్పుడేమో పెట్టుబడి కూడా చేతికి రావడం లేదు. అధికారులు పంట పండదని చెబుతున్నారు. నష్ట పరిహారం ఇస్తేనే బతకగలం.

– డి.అంజనేయులు, సోమేపల్లి

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు బూచేపల్లి, తాటిపర్తి, ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి
- జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న కార్యకర్తలకు పరామర్శ
- బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన బత్తుల బ్రహ్మానందారెడ్డి తదితరులు



జిల్లా జైలు వెలుపల వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు బూచేపల్లి, తాటిపర్తి

ఒంగోలు టౌన్: ఒంగోలు శ్రీనగర్ కాలనీ గణేశ్ విగ్రహ నిమజ్జనం సందర్భంగా పోలీసులతో జరిగిన తోపులాటకు సంబంధించి అక్రమ కేసులో అరెస్టయి జిల్లా జైల్లో ఉన్న ఆరుగురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఆ పార్టీ నేతలు శుక్రవారం పరామర్శించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు తదితరులు శుక్రవారం ములాఖత్ ద్వారా జైలులో ఉన్న పార్టీ కార్యకర్తలను కలిసి మాట్లాడారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జైలు వెలుపల ఉన్న వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, చీమకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావుపాల్గొన్నారు.

మద్యం మత్తులో బీర్‌బాటిల్‌తో దాడి

ఒంగోలు టౌన్: పూటుగా మద్యం తాగిన ఓ వ్యక్తి మరో యువకుడిపై బీర్ బాటిల్‌తో దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన శుక్రవారం ఒంగోలు నగరంలోని కల్యాణి బార్ అండ్ రెస్టారెంట్‌లో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. పెళ్లూరుకు చెందిన కోణంకి అయ్యప్ప శుక్రవారం ఉదయం 9 గంటల సమయానికి మద్యం సేవించేందుకు నగరంలోని నెల్లూరు బస్టాండ్ సెంటర్లోని కళ్యాణి బార్ అండ్ రెస్టారెంట్‌కు వచ్చాడు. అప్పటికే బార్‌లో నగరంలోని భాగ్యనగర్‌కు చెందిన షేక్ అనిల్ మద్యం తాగుతున్నాడు. పూటుగా తాగిన మత్తులో ఉన్న అనిల్ విచక్షణ కోల్పోయాడు. చేతిలోని బీర్ బాటిల్ పగలగొట్టి పక్కన ఉన్న అయ్యప్ప మీద దాడి చేశాడు. అయ్యప్పకు గాయాలు కావడంతో స్థానికులు హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించారు. భార్యతో మనస్పర్థల కారణంగా గత కొంతకాలంగా అనిల్ చిత్తుగా తాగి తిరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

విరిగిపడిన శతాబ్ది మర్రిచెట్టు కొమ్మలు



ఇంకొల్లులో విరిగిపడిన మర్రిచెట్టు కొమ్మలు

ఇంకొల్లు(చినగంజాం): ఇంకొల్లు– పావులూరు రోడ్డులో నాగులు చెరువు కట్టపై ఉన్న సుమారు వందేళ్ల నాటి భారీ మర్రి చెట్టు కొమ్మలు శుక్రవారం సాయంత్రం హఠాత్తుగా విరిగి పడ్డాయి. ఆ సమయంలో అక్కడ జన సంచారం లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. నిత్యం రద్దీగా ఉండే రోడ్డుపై చెట్టు కొమ్మలు విరిగి పడటంతో సాయంత్రం మూడు గంటల నుంచి ట్రాఫిక్ స్తంభించింది. పంచాయతీ కార్యదర్శి అడ్డగడ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చెట్టు కొమ్మలను తొలగించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. సాయంత్రం 6 గంటల తర్వాత ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

ఉప్పలపాడులో టీడీపీ నేతల దుశ్చర్య



ఉప్పలపాడులో టీడీపీ కార్యకర్తలు పగలగొట్టిన వైఎస్సార్ సీపీ జెండా దిమ్మె



అధికారులు హుటాహుటిన నిర్మించిన టీడీపీ జెండా దిమ్మె

- వైఎస్సార్ సీపీ జెండా దిమ్మె ధ్వంసం

పొదిలి రూరల్: అధికారం చేతిలో ఉందన్న అహంకారంతో టీడీపీ కార్యకర్తలు దుశ్చర్యకు ఒడిగట్టారు. వైఎస్సార్ సీపీ శ్రేణులను ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తూ అక్రమ కేసులు బనాయించే కుట్రలకు తెరదీస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పొదిలి మండలంలోని ఉప్పలపాడులో సర్పంచ్ గుంటూరి ఏసోబు, పంచాయతీ కార్యదర్శి శేషగిరి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేస్తున్నారు. జేసీబీతో ఆక్రమణలు తొలగించి, కాలువ పూడికతీత పనులు చేసే క్రమంలో అప్పటికే శిథిలావస్థలో ఉన్న టీడీపీ జెండా దిమ్మె పగిలిపోయింది. స్థానిక టీడీపీ నేతలు వాగ్వాదానికి దిగడంతో పొరపాటున తగిలిందని చెప్పి హుటాహుటిన నూతన దిమ్మె నిర్మించారు. అయితే దీనికి టీడీపీ నేత, ఉప్పలపాడు సొసైటీ అధ్యక్షుడు ఉలవా గోపి రాజకీయాలు ఆపాదించాడు. మద్యం మత్తులో ఉన్న టీడీపీ కార్యకర్తలను ఉసిగొల్పడంతో కొమ్ము లక్ష్మీనారాయణ, గుంటూరి బ్రహ్మయ్యతోపాటు మరికొందరు కలిసి గురువారం అర్ధరాత్రి వైఎస్సార్ సీపీ జెండా దిమ్మెను గడ్డపారలతో ధ్వంసం చేశారు. ఇదేం అన్యాయమని ప్రశ్నించిన వారిని »పగలగొడతాం. ఏం చేసుకుంటారో చేసుకోండి« అంటూ వెళ్లిపోయారు. దీనిపై శుక్రవారం ఉదయం గ్రామంలో ఇరు పార్టీల నేతల మధ్య ఉద్రిక్తత చోటుచేసుకుంది. టీడీపీకి చెందిన పెద్దలు కొందరు తమవాళ్లదే తప్పని అంగీకరించడంతోపాటు వైఎస్సార్ సీపీ జెండా దిమ్మెను కట్టిస్తామని చెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

అధిక ఫీజు వసూలుపై విద్యార్థుల ఆందోళన

- సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేత



సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని గౌతమి డిగ్రీ కళాశాల యాజమాన్యం తమ వద్ద అధికంగా పరీక్ష ఫీజు వసూలు చేస్తోందని ఆరోపిస్తూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. శుక్రవారం కళాశాల నుంచి మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. యూనివర్సిటీ నిర్ణయించిన విధంగా పరీక్ష ఫీజు ఒకే విధంగా ఉండాలని, కళాశాలలో మాత్రం అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మిగిలిన ఫీజులు కూడా చెల్లించాలని తమపై ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చెల్లించే ఫీజు రీయింబర్స్‌మెంటుతో తమకు సంబంధం లేదని, కళాశాల సిబ్బంది చెప్పారని, దీంతో 3, 5వ సెమిస్టర్ ఫీజులతోపాటు కళాశాల ఫీజు కూడా కట్టాలని బలవంతం చేస్తున్నారన్నారు. 3వ సెమిస్టర్ ఫీజు ప్రభుత్వం నుంచి జమ అయినప్పటికీ తమ వద్ద మళ్లీ ఫీజులు వసూలు చేస్తున్నారని, దీంతో తాము ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి తీవ్రగాయాలు



చినారికట్ల జంక్షన్ వద్ద తీవ్రంగా గాయపడిన మల్లికార్జున

పెద్దదోర్నాల/కొనకనమిట్ల: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో శుక్రవారం చోటుచేసుకున్న రెండు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పెద్దదోర్నాల మండలంలో కర్నూలు–గుంటూరు జాతీయ రహదారిలోని కొర్రప్రోలు ఫారెస్ట్ చెక్‌పోస్టు సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న గుడ్డెపోగు రమేష్, జీనేపల్లి హరిశ్చంద్రప్రసాద్, వెంకటేశంకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. ఎండు కట్టెల కోసం నల్లగుంట్ల నుంచి పెద్ద మంతనాల వైపు ఆటోలో వెళ్తుండగా కొర్రప్రోలు చెక్ పోస్టు సమీపంలో బోల్తా పడింది. ప్రమాదాన్ని ప్రత్యక్షంగా చూసిన యువకులు తలకు తీవ్ర గాయమైన వెంకటేశంను గుంటూరు తరలించగా, మిగిలిన ఇద్దరిని 108 అంబులెన్స్‌లో పెద్దదోర్నాల ఆస్పత్రిలో చేర్చారు. వీరిని మెరుగైన వైద్యం కోసం నర్సరావుపేట వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పోలీసులు పరామర్శించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీని ఢీకొట్టిన బైక్

పొదిలి బెస్తపాలేనికి చెందిన పెరమసాని మల్లికార్జున కొనకనమిట్ల మండలం గనివానిపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఆయనకు ఇటీవల గ్రేడ్ 5 నుంచి గ్రేడ్ 4 పంచాయతీ కార్యదర్శిగా ప్రమోషన్ దక్కింది. ఈ నేపథ్యంలో కనిగిరి మండలంలో కార్యదర్శి పోస్టులు ఖాళీగా ఉన్న పంచాయతీల వివరాలు తెలుసుకునేందుకు శుక్రవారం సాయంత్రం తన బైక్‌పై వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో చినారికట్ల జంక్షన్ సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని చీకట్లో గమనించక వెనక భాగంలో ఢీకొట్టారు. బైక్ నుంచి ఎగిరి కింద పడిన మల్లికార్జున తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు స్పందించి 108 అంబులెన్స్‌లో పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించినట్లు మల్లికార్జున బంధువులు తెలిపారు.



కొర్రప్రోలు వద్ద ఆటో ప్రమాదంలో క్షతగాత్రులు